
ప్రజాశక్తి
శనివారం 17 మే 2025



ఎమ్మెల్యేపై తహశీల్దార్ ఫిర్యాదు

నానా దుర్భాషలాడారని ఆవేదన

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రపై మండల తహశీల్దార్ జయలక్ష్మి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 15 రాత్రి 9.59 నిమిషాలకు తనకు వాట్సాప్ కాల్ చేసి అసభ్య పదజాలంతో దుర్భాషలాడారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. చెప్పడానికి వీలుకాని భాషలో ఎమ్మెల్యే దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆయన ఎందుకు అంత అసభ్య పదజాలంతో దుర్భాషలాడారనేది తహశీల్దార్ జయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొనలేదు. భూముల వ్యవహారాలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని ఒత్తిడి చేయడం.. తహశీల్దార్ జయలక్ష్మి ఆ పనులు చేయని కారణంగా ఎమ్మెల్యే బోనెల దుర్భాషలాడినట్లు తెలిసింది. తహశీల్దార్ జయలక్ష్మి కొద్ది నెలల క్రితం బదిలీపై రాయలసీమ ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వ్యవహారశైలిపై తహశీల్దార్ జయలక్ష్మి.. డిఆర్ఒ, జెసిలకు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

ఏటా ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే చాలు ఏజెన్సీ ప్రాంతంలో రైతులు సాగునీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. మన్యంలో పుష్కలమైన నీటి వనరులున్నా వినియోగంలోకి తీసుకువచ్చే ఆలోచన చేయకపోవడంతో వర్షాలపైనే ఆధారపడుతున్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే రైతులు పంట పండినట్టే. లేదంటే ఆ ఏడాది కరువే. ఇది ఏజెన్సీలో దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఏజెన్సీలోని సాగునీటి వనరులను అభివృద్ధి చేస్తామని, పంట పొలాలకు సాగునీరు అందిస్తామని గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి.


అభివృద్ధికి నోచుకోని మినీ రిజర్వాయర్

సాగునీరు కరువే

అభివృద్ధికి నోచుకోని మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యాములు • వర్షాధారంపైనే ఆధారం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో ముఖ్యంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో దశాబ్దాలుగా జీవ గెడ్డలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఏళ్ల తరబడి అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాలు వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల వాగ్దానాల్లో చిన్న తరహా సాగునీటి వనరుల అభివృద్ధి కోసం హామీలిచ్చిన నేతలు తీరా అధికారం చేపట్టాక నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఏజెన్సీలో సాగునీరు లేకుండా పోయింది. ఫలితంగా పంటలకు సాగునీరు అందక కరువు ఏర్పడి బీడు భూములుగా మారుతున్నాయి. మన్యంలో కొండల్లో అనేక జీవ గెడ్డలు ప్రవహిస్తున్నాయి. వీటిపై చిన్నచిన్న ప్రాజెక్టులు నిర్మిస్తే వేలాది ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందే అవకాశం ఉంది.

ఏళ్లతరబడి చిన్నచూపే

గిరిజన రైతుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధులు అలసత్వం కారణంగా ఏళ్ల తరబడి సాగునీటి వనరులపై చిన్నచూపు కనిపిస్తోంది. కొత్త వాటిని నిర్మించడం లేదు సరి కదా? ఉన్నవాటినైనా అభివృద్ధి పరిచే ఆలోచన లేకపోవడం గిరిజన రైతులకు శాపంగా మారింది. కేవలం ప్రతిపాదనలతోనే సరిపెడుతున్నారు.

ఉపాధి లేదు.. పంటలు పండవు



ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవు. సాగు చేద్దామంటే సరైన సమయంలో వర్షాలు లేక, నీరు రాక పంటలు పండటం లేదు. పండించే అటవీ ఫలసాయాలకు గిట్టుబాటు ధర లేదు. ప్రభుత్వాల సహకారం లేక కరువుతో బతుకు బరువై వలసలు పోతున్నారు.

– మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి

సాగునీటి వనరులను అభివృద్ధిచేయాలి



ఏజెన్సీ ప్రాంతంలో నిర్లక్ష్యానికి గురవుతున్న సాగునీటి వనరులపై ఐటిడిఎ అధికారులు దృష్టి సారించి అభివృద్ధి పరచాలి. మైదాన ప్రాంత రైతులు ఏడాదికి రెండు మూడు పంటలు వేసుకుంటే, ఏజెన్సీ ప్రాంత రైతులు మాత్రం ఒక్క పంట పండించేందుకే నానా ఇబ్బందులు పడుతున్నారు. మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యాములు నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టి పంట పొలాలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టారు.

– కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

కొద్దిగా కేటాయిస్తే..

- గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో సీమలగూడ మినీరిజర్వాయర్ అభివృద్ధి కోసం రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు మూడు సార్లు ప్రతిపాదనలు చేసినా అభివృద్ధి పనులు శూన్యం. ఈ రిజర్వాయర్ అభివృద్ధిలోకి తీసుకొస్తే సమీపంలోని కేదారిపురం, కేదారిపురం కాలనీ, కుంభయ్య గూడ, సీమలగూడ తదితర పది గ్రామాల్లో 1500 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తోంది. గంద్ర సమీపంలో ఉన్న చెక్‌డ్యామ్ కూడా మరమ్మతులకు గురైంది. దీన్ని అభివృద్ధి పరిస్తే సమీపంలోని 1,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.
- కురుపాం మండలం గుమ్మిడిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం చేపడితే 15 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కేవలం రూ.5 కోట్ల ఖర్చుతో కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో 52 గ్రామాల రైతాంగానికి సాగునీరు పుష్కలంగా అందుతుంది.
- పనసభద్ర సమీపంలో ఉన్న డేకురాయి వద్ద చెక్‌డ్యామ్ నిర్మిస్తే 1500 ఎకరాలు సాగయ్యే అవకాశాలున్నాయి.
- వలసబల్లేరు వద్ద చెక్‌డ్యామ్ కడితే వెయ్యి ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి.
- కొలిస వద్ద చెక్‌డ్యామ్ నిర్మిస్తే 750 ఎకరాల బీడు భూములు సాగులోకి వస్తాయి.
- కేదారిపురం గెడ్డ, దేరువాడ గెడ్డ, తాడికొండ గెడ్డ, డేకురు గెడ్డ తదితర గెడ్డలు, వాగులపై మినీ రిజర్వాయర్ల నిర్మాణానికి కేవలం రూ.50 కోట్లు ఖర్చు చేస్తే గిరిజన ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది.



గిరిజనుల పోడు భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ, అటవీశాఖ అధికారులు

గిరిజనులపై దౌర్జన్యం

పోడు భూములను లాగేసుకున్న అధికారులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

గిరిజనుల సాగులో ఉన్న భూములను రెవెన్యూ, అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా లాగేసుకున్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులను ఆ భూముల నుంచి దూరం చేసి, కోలుకోలేని విధంగా దెబ్బతీశారు. పార్వతీపురం మండలం సంగంవలస పంచాయతీ సీతంపేట గ్రామ పరిధిలో 38 ఎకరాల భూమిని శుక్రవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. గత కొన్నేళ్లుగా సీతంపేట గ్రామానికి చెందిన 11 గిరిజన కుటుంబాలు 38 ఎకరాల్లో పోడు వ్యవసాయం చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాయి. ఆ భూములు అటవీ శాఖకు చెందినవని పలుమార్లు ఫారెస్ట్ సిబ్బంది గిరిజనులను బెదిరించి, పంటలను ధ్వంసం చేశారు. ఈ తరుణంలో శుక్రవారం ఆ భూములను రెవెన్యూ అధికారులు గిరిజనుల నుంచి లాగేసుకుని చేసుకుని, అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. తమకు జీవనాధారమైన భూమిని అధికారులు లాక్కోవడంతో ఉపాధి కోల్పోతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా అధికారులు స్పందించి, సాగు చేసుకునేందుకు భూములు కేటాయించాలని కోరారు.

నేడు స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

పార్వతీపురం : జిల్లాలో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై కలెక్టర్ శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీట్ ది హీట్ నినాదంతో ఈ నెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి కార్యాలయంలోనూ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని పరిశుభ్ర వాతావరణ నెలకొనే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

పిడుగు పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి-సీతంపేట

వేర్వేరు చోట్ల పిడుగుపడి ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటనలు సీతంపేట, పాలకొండ మండలాల్లో చోటుచేసుకున్నాయి.

సీతంపేట మండలంలో దేవనాపురం పంచాయతీ జగత్‌పల్లి బూర్జిగూడ చెందిన సవర చంద్రరావు (28) దేవనాపురం సమీపంలో ఉన్న పొలంలో శుక్రవారం ట్రాక్టర్ ద్వారా దున్నించడానికి వెళ్లాడు. సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షం ప్రారంభమైంది. పొలానికి కొద్ది దూరంలో ఉన్న చంద్రరావుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. డ్రైవరు వెళ్లి చూసేసరికి చంద్రరావు విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ అమ్మన్నరావు కేసు నమోదు చేశారు. చంద్రరావుకు తల్లి సవర చొట్టమ్మ, సోదరుడు ఉన్నారు. చంద్రరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాలకొండ పట్టణంలో పిడుగులు పడి జోగు లక్ష్మి (40) అనే మహిళ మృతి చెందారు. పట్టణంలో ఎన్ఎస్ఎన్ కాలనీలో నివసిస్తున్న జోగు లక్ష్మి వర్షం పడుతున్న సమయంలో డాబా మీద ఉండిపోయిన బట్టలు తీసుకుని రావడానికి వెళ్లారు. ఆ సమయంలో పిడుగు పడి ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఈమె మృతితో భర్త ఎర్రన్నాయుడు తో పాటు కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

ఆటో బోల్తా..

ఉపాధి కూలీ దుర్మరణం

ప్రజాశక్తి-వీరఘట్టం


ప్రసాద్‌కు చికిత్స అందిస్తున్న వైద్యులు

ఆటో బోల్తా పడి ఉపాధి హామీ కూలీ మృతిచెందాడు. ఈ సంఘటన వీరఘట్టం మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గడగమ్మ గ్రామానికి చెందిన అరసాడ ప్రసాద్ (49) చినగొరకాలనీ సమీపంలోని ఆరుద్రమ్మ చెరువులు ఉపాధి పనులకు వెళ్లాడు. పనులు ముగించుకుని తోటి కూలీలతో కలిసి ఆటోలో తిరిగి వస్తుండగా, అచ్చుపువలస గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడింది. దీంతో ప్రసాద్, పత్రా సంతోషమ్మకు గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన ప్రసాద్‌ను స్థానిక పిహెచ్‌సికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి, పాలకొండ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన మరణించాడు. ఎపిఒ సత్యంనాయుడు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ కృష్ణప్రసాద్ మృతదేహాన్ని పరిశీలించారు. సంతోషమ్మ వీరఘట్టం పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు.

వేరేచోట పనులు కల్పించడం వల్లే..

ఉపాధి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రసాద్ మరణించాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలోనే ఉపాధి పనులు కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ పని కల్పించడం లేదని చెప్పారు. వేరే గ్రామంలో పని కల్పించడం వల్ల ప్రమాదం చోటుచేసుకుందని, దీనికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు.

ప్రజలకు సత్వర వైద్య సేవలు

మంత్రి సంధ్యారాణి • తోణాం పిహెచ్‌సి ప్రారంభం

ప్రజాశక్తి-సాలూరురూరల్


పిహెచ్‌సిని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

గ్రామీణ ప్రాంత ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు మండలం తోణాం గ్రామంలో రూ.1.82 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా చుట్టుపక్కల గ్రామస్తులకు ప్రాథమిక వైద్య సదుపాయాలు, బాలింతల సంరక్షణ, టీకాలు, సాధారణ వైద్య పరీక్షలు వంటి సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. అదనంగా 50 లక్షల రూపాయలతో భవనాన్ని నిర్మిస్తామని, దానిని పుట్టిన బిడ్డల వెయిటింగ్ హాలుగా వినియోగిస్తామని చెప్పారు. అధునాతన పరికరాలను పిహెచ్‌సిలో ఏర్పాటు చేశామని తెలిపారు. మన్యం జిల్లా సాధారణ ప్రసవాలలో అగ్రస్థానంలో ఉందని, ఇదే పరిస్థితిని వైద్యులు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆశావర్కర్లు గ్రామాల్లో మంచి వైద్య సేవలు, ఆరోగ్య విద్యను అందించుటకు ముందుండాలని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఆరోగ్య పరిస్థితి పట్ల అవగాహన పోస్టరును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో

సాగునీటి పనులకు ప్రాధాన్యత

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి -గరుగుబిల్లి


వేతనదారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఉపాధి హామీలో రైతులకు బహుళ ప్రయోజనాలైన పనులకు ప్రాధాన్యతనిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలో కొంకిడివరంలో ఉపాధి హామీ ద్వారా చెరువు ఫీడర్ నిర్మాణ పనులకు శుక్రవారం కలెక్టర్ శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి ముచ్చటించారు. గత నెల వరకు ప్రభుత్వం ఉపాధి హామీ పనులు కూలీలకు వేతనాలను మంజూరు చేసినందున వేతనదారులకు అందినది, లేనిది ఆరా తీశారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం పూట త్వరగా పనులు మొదలు కావాలని సూచించారు. ఉపాధి హామీ వేతనంతో జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలని కోరారు. ఉపాధి హామీ కింద జిల్లాలో చెరువు నుంచి చెరువుకు కలుపుతూ చేపట్టే పనులు 120 మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో 11 పనులు మంజూరైనట్లు వివరించారు. బోనివానిచెరువులోకి వచ్చే ఫీడర్ ఛానల్ గండి కొట్టిన చోట ఉపాధి పనుల కింద రూ.8 లక్షల వ్యయంతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు బహుళ ప్రయోజనం చేకూర్చే ఫారం పాండ్స్ (నీటి కుంటలు), సాగునీటి కాలువలు, చెరువులను కలిపే కాలువ పనుల నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు అప్పలనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఆర్.అప్పలనాయుడు, ఉదయ్‌భాస్కర్, ఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి సిహెచ్.కూర్మినాయుడు, తదితరులు, పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి – సాలూరు

ఆపరేషన్ సింధూర్‌కి, భారత సైన్యానికి మద్దతుగా సాలూరు పట్టణంలో తిరంగా యాత్ర ర్యాలీని మంత్రి సంధ్యారాణి శుక్రవారం నిర్వహించారు. ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి బోసుబొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశరక్షణ కోసం పోరాడుతున్న సైనికులకు అంతా మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, సిఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, అధికారులు, కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో ర్యాలీలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి, నాయకులు, అధికారులు


పార్వతీపురంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ చేపడుతున్న ఎమ్మెల్యే, ప్రజలు

పార్వతీపురంటౌన్ : సైన్యానికి మద్దతుగా శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. పాత బస్టాండ్ వద్ద ప్రారంభమైన ర్యాలీ నాలుగు రోడ్ల జంక్షన్, మెయిన్ రోడ్డు మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి, జిల్లా కలెక్టరేట్ వరకు సాగింది. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రముఖ వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల ఆదాయ వృద్ధిరేటు పెంచాలి

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-గరుగుబిల్లి

ప్రణాళికా బద్ధంగా పనిచేసి పాడి రైతుల ఆదాయ వృద్ధి రేటు పెంచాలన్న లక్ష్యంతో కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఉద్యాన వన కళాశాలలో వ్యవసాయ అనుబంధ రంగాల కన్వర్జెన్స్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. పాల ఉత్పత్తి పెరగడానికి ట్రిపుల్ ఎస్ (లింగ నిర్ధారణ సెమెన్) సరఫరా చేసి ఆడజాతి దూడల వృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఉపాధి హామీ కింద బహువార్షిక పశు గ్రాసాలను సాగు చేయడం, 50 శాతం రాయితీపై సమీకృత దాణా, టిఎంఆర్, చాఫ్ కట్టర్లు, పాలు పిండే యంత్రాలు అందజేయడం వంటి అవకాశాలపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. పాడి పశువులను మహిళా సంఘాల ద్వారా పంపిణీకి ఆసక్తి ఉన్న లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని వెటర్నరీ అసిస్టెంట్లను ఆదేశించారు. మహిళా పాల సొసైటీలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో మినీ గోకులాలను 375 వరకు మంజూరు చేశామని, ఇంకా 1500 వరకు మంజూరు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, జిల్లా ఉద్యాన వన అధికారి శ్యామల, ఉప సంచాలకులు పి.రామ్మోహన్, అసిస్టెంట్ డీన్ ఆర్.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-పార్వతీపురం


మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో చేపడుతున్న పిఎం జన్‌మన్ గృహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని పిఒ అశుతోష్ శ్రీవాత్సవ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబరులో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో పిఎం జన్‌మన్ గృహ నిర్మాణాలపై అధికారులు మరింత ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల ప్రగతిలో ఆయా శాఖాధిపతులకు పంచాయతీలను కేటాయించామని, ఆ మేరకు అధికారులందరూ ప్రతిరోజు గృహ నిర్మాణ పనులను పర్యవేక్షించి త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ కింద చేపడుతున్న పనులతోపాటు ఎపిడిలు, పిహెచ్‌ఒలు సమన్వయం చేసుకొని ఐటిడిఎ పరిధిలోని మండలాల్లో జీడి మొక్కల పెంపకానికి ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో జీడి పిక్కల కొనుగోళ్లకు మంచి అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఈ పెంపకం వల్ల గిరిజనులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎపిఒ శ్రీనివాస్, వెలుగు ఎపిడి వై.సత్యంనాయుడు, పిహెచ్ఒ మణిభూషణ్, ఉపాధి హామీ ఎపిడి సురేష్ నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఆర్.కృష్ణవేణి, డిప్యూటీ ఇఒ జ్ఞానప్రకాశ్, ఎపిఒ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకపక్షమంటే కమిషనర్‌కు చులకన

మున్సిపల్ ఆర్‌డికి ఫిర్యాదు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్


ఆర్‌డికి ఫిర్యాదు చేస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు

కమిషనర్ వెంకటేశ్వర్లుకు మున్సిపాలిటీ పాలకపక్ష సభ్యులంటే చులకనభావమని, మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం లేదని చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైసిపి కౌన్సిలర్లు.. మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ రవీంద్రకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పార్వతీపురం కమిషనర్ ఛాంబర్‌లో ఆర్‌డిని వారంతా కలిసి, కమిషనర్ తీరుపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరిలో కమిషనర్‌గా వచ్చిన సిహెచ్ వెంకటేశ్వర్లు పాలకపక్ష కౌన్సిల్ సభ్యులను గౌరవించడం లేదన్నారు. వార్డుల్లో సమస్యలు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని, కొందరు సభ్యులపై కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మూడు నెలలుగా బడ్జెట్, సాధారణ సమావేశాలు పెట్టాలని చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో వార్డుల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, కార్యాలయంలో కొన్ని రకాల బిల్లులు చెల్లింపులు కూడా జరగడం లేదని వివరించారు. మున్సిపల్ పాలన గాడి తప్పిందన్నారు. ఈ విషయంపై శనివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. కమిషనర్‌పై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిల్ సభ్యులు సువ్వాడ లావణ్య, చీకటి అనురాధ, ఎడ్ల త్రినాథ, రణభేరి శివకుమార్, తెలుగు బోదయ్య, నాయకులు బి.ఆదినారాయణ, నేతాజీ, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజంలో షణ్ముఖరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి–పార్వతీపురం


డాక్టరేట్ అందుకుంటున్న షణ్ముఖరావు

ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం విభాగ పరిశోధక విద్యార్థి, సాలూరు వాసి రేగాన షణ్ముఖరావుకు డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఆంధ్రకేశరి విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డి.వి.ఆర్ మూర్తి పర్యవేక్షణలో 'డిఫ్యూజన్ ఆఫ్ ఇన్నోవేషన్ అమోంగ్ షెడ్యూల్ క్యాస్ట్ పాపులేషన్ : ఏ స్టడీ ఆఫ్ మోసూరు విలేజ్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై చేపట్టిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి.పి రాజశేఖర్ నుంచి డాక్టరేట్‌ను షణ్ముఖరావు శుక్రవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను విభాగాచార్యులు, పరిశోధకులు అభినందించారు. ప్రస్తుతం షణ్ముఖరావు అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో సమాచార పౌర సంబంధాల శాఖలో పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పిఆర్‌ఒ)గా విధులు నిర్వహిస్తున్నారు.

నిరుత్సాహ పడొద్దు

ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి–సీతంపేట

పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, మళ్లీ పరీక్ష రాసి ఉత్తీర్ణత అవ్వాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సీతంపేట బాలుర, బాలికల పాఠశాలలో ఇస్తున్న శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు బాగా చదివి ఉత్తీర్ణులు కావాలన్నారు. విద్యార్థులకు సందేహాలున్న పాఠ్యాంశాలను మరోసారి వారికి అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు చంద్రరావు, వసంత లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టిసారించాలి

ప్రజాశక్తి–పార్వతీపురంటౌన్

పార్వతీపురం పట్టణంలో ఇప్పల పోలమ్మ, జగన్నాథపురంలో ఎర్ర కంచమ్మ గ్రామ దేవతల పండగల నేపథ్యంలో తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై దృష్టిపెట్టాలని సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు.. మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ రవీంద్రను కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఆయన్ను కలిసి, సమస్యలను వివరించారు. పండగలకు లక్షల్లో జనం వచ్చే అవకాశం ఉందని, వారికి సరిపడా తాగునీరు అందించాలని కోరారు. పారిశుధ్య నిర్వహణ కూడా మెరుగుపరచాలని విజ్ఞప్తిచేశారు. పారిశుధ్య కార్మికులు, సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, వాటిని భర్తీ చేయాలని చెప్పారు. పట్టణంలో అక్రమ కట్టడాలపై చర్యలు చేపట్టాలని,కోరారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజా దర్బార్‌కు 26 వినతులు

ప్రజాశక్తి–గుమ్మలక్ష్మీపురం

స్థానిక టిడిపి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి 26 వినతులు అందాయి. ముఖ్యంగా రోడ్లు, తాగునీరు, సాగునీరు సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. ప్రజల నుంచి వస్తున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

గ్లైఫోసేట్‌పై నిషేధం

ప్రజాశక్తి–పాచిపెంట

కలుపుమందు గ్లైఫోసేట్ విక్రయం, వినియోగంపై ఆంక్షలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని పి.కోనవలస, పెదచీపురువలస, శ్యామలగౌరీపురం, చెరుకుపల్లి గ్రామాల్లో భూసారం పెంపులో నవధాన్యాల సాగు ఆవశ్యకతపై శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లైఫోసేట్ అమ్మిన, వినియోగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మందు వినియోగం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని తెలిపారు. రైతులు సాధ్యమైనంత వరకు కలుపు మందులకు దూరంగా ఉండాలన్నారు. హెచ్‌టి కాటన్‌గా పిలిచే గడ్డిపికల పత్తి లేదా గ్లైసిల్ పత్తి పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఇది పర్యావరణానికి ఎంతో ప్రమాదకరమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్, నాగమణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విజయ్, కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి–కొమరాడ

మారుమూల గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఇన్‌ఛార్జి ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి గౌరినాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలో గిరిశిఖర గ్రామాలైన జాకూరు, గుడ్డం, ఉలిగేసు, వనకబడిలో ఆయన పర్యటించారు. తాగునీరు సరఫరా కావడం లేదని గిరిజనులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రతి గ్రామంలోనూ పర్యటించి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఏజెన్సీ గ్రామాల్లో తాగునీటిని అందించేందుకు సదుపాయాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్తు శాఖ డిఇఇగా విష్ణుమూర్తి

ప్రజాశక్తి–పాలకొండ

విద్యుత్తు శాఖ డిఇఇగా విష్ణుమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి ఎడిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి–సీతానగరం

సీతానగరం మండలంలోని బూర్జ, గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్రలో ఉన్న మద్యం దుకాణాలను ఎక్సైజ్ సిఐ పద్మావతి శుక్రవారం తనిఖీ చేశారు. మద్యం రేట్లు, రికార్డులను తనిఖీ చేశారు. స్టాకు వివరాలు కూడా పరిశీలించారు.

వికలాంగ చిన్నారుల గుర్తింపు

ప్రజాశక్తి – కురుపాం

శారీరక, మానసిక పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు ఐఇఆర్‌టిలు ఎం.గౌరీశ్వరి, ఎన్.శ్రీదేవి శుక్రవారం కురుపాంలో సర్వే చేపట్టారు. గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు కలిసి ఇంటింటికి వెళ్లి పిల్లల వివరాలు సేకరించి, భవిత కేంద్రంలో చేర్పించనున్నట్లు వారు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి–పాలకొండ

మండలంలో చింతాడ మాజీ సర్పంచ్ రామచంద్రి నాయుడు (52) గుండెపోటుతో మృతి చెందారు. గ్రామం నుంచి కొద్దిరోజుల క్రితం విజయవాడ వెళ్లిపోయారు. అక్కడ గుండెపోటుతో చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని చింతాడ తీసుకొచ్చారు.

పశువైద్యానికి సుస్తీ

- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- కొన్నిచోట్ల భవనాలు లేక.. మరికొన్నిచోట్ల శిథిలావస్థలో..

వ్యవసాయానికి అనుబంధంగా ఉండేది పాడి పరిశ్రమ. దానిలో భాగంగా పశువులను రైతులు పెంచుతుంటారు. అందుకే 'పాడి రైతు' అని పిలుస్తుంటారు. అలాంటి పశువులకు రోగం వస్తే వైద్యం అందక మృత్యువాత పడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణ పశువైద్యానికి సుస్తీ చేయడంతో ఈ దుస్థితి దాపురించింది. పశు వైద్యంపై సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఈ దుర్భర స్థితికి కారణం. జిల్లాలో పశువైద్యులు, సిబ్బంది కొరత ఓ వైపు వేధిస్తోంది. ఒకే వైద్యాధికారి మూడు పశువైద్యశాలలను ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. కొన్నిచోట్ల భవనాలు లేక, మరికొన్నిచోట్ల ఉన్న భవనాలు శిథిలావస్థలో ఉండటంతో కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదు.


శిథిలావస్థలో ఉన్న భామిని పశు వైద్యశాల

వైద్యుల పోస్టులు ఇలా..

మండలం	అవసరం	ఉన్నవి
భామిని	2	0
సీతంపేట	3	2
పాలకొండ	3	1
వీరఘట్టం	3	1
గరుగుబిల్లి	2	1
జియ్యమ్మవలస	2	1
కురుపాం	2	1
గుమ్మలక్ష్మీపురం	2	1
కొమరాడ	3	1
పార్వతీపురం	4	3
సీతానగరం	2	1
బలిజిపేట	3	1
సాలూరు	2	1
మక్కువ	2	1
పాచిపెంట	3	2

ప్రజాశక్తి–సీతంపేట

సీతంపేట ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలో సీతంపేట, భామిని మండలాలు ఉన్నాయి. సీతంపేటలో ఆవులు, దూడలు, ఎద్దులు 13,063 ఉన్నాయి. గేదెలు, దున్నలు, పెయ్యలు 1872, మేకలు 1553, గొర్రెలు 6251 ఉన్నాయి. భామిని మండలంలో ఆవులు, దూడలు, ఎద్దులు 9047 ఉన్నాయి, గేదెలు, దున్నలు 2170, గొర్రెలు 8295, మేకలు 5955 ఉన్నాయి. ఇక మన్యం జిల్లాలో పశుసంపద అధికంగా ఉంది. దానితగ్గట్టు 15 మండలాల్లో పశువైద్యశాలలు కొన్ని ఉన్నాయి. మరికొన్ని శిథిలావస్థకు చేరాయి. భవనాలు లేక పరాయి పంచన కాలం వెలిబుచ్చుతున్నాయి.

పొల్లలో పశు వైద్యశాల భవనం లేదు. దీంతో రైతు సేవా కేంద్రంలో పశువైద్యశాల నిర్వహిస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. భామిని పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. బత్తిలి పశువైద్యశాలకు చిన్నపాటి మరమ్మతులు చేపట్టి వినియోగిస్తున్నారు. ఇక వర్షాకాలంలో పశువులకు అధికంగా గాలి కుంటువ్యాధి, ఇతర వ్యాధులు సోకుతాయి. దానికి తగ్గ వైద్యులు, మందులు లేకపోతే మృత్యువాత పడే ప్రమాదం ఉంది. జూన్ నెలలో పశువైద్యులు, సిబ్బంది బదిలీలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. అప్పుడైనా మన్యం జిల్లాకు పూర్తిస్థాయిలో పశువైద్యులను, సిబ్బందిని నియమిస్తారని గిరిజనులు ఆశిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



ప్రాంతీయ ఆసుపత్రి పరిధిలో పశువైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాంతోపాటు పొల్లలో భవనం లేదు. భామిని పశువైద్యశాల శిథిలావస్థలో ఉంది. దీనిపై ప్రతిపాదనలు పంపించాం. మందుల సమస్య లేదు. ఉన్న సిబ్బందితో పశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

– శ్రీనివాసరావు, ఎడి, పశుసంవర్థక శాఖ, సీతంపేట

వేధిస్తున్న సిబ్బంది కొరత

- జిల్లాలో పశుసంవర్థక శాఖలో సరిపడా వైద్యులు లేరు. 15 మండలాల్లో ఏడు ఎడి పోస్టులకు గరుగుబిల్లిలో ఎడి లేరు. ఒక ఏడి రెండు మండలాల పరవేక్షించాల్సిన అవసరం ఉంది. దీనిలో భాగంగా 15 మండలాల్లో 38 వశు వైద్యుల పోస్టులకు 18 మాత్రమే ఉన్నారు
- సీతంపేట ప్రాంతీయ పశు వైద్యశాలలో ఆఫీస్ సబార్డినేటర్, డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు గత కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్నాయి.
- పొల్ల పశువైద్యశాలలో వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- బగ్గ పశువైద్యశాలలో వైద్యుడి పోస్టు, వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేటర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.
- భామిని, బత్తిలి పశువైద్యశాలలో వైద్యులు లేరు. వెటర్నరీ అసిస్టెంట్ లేరు.
- దోనుబాయి పశువైద్యాధికారి.. బగ్గలో ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపడుతున్నారు. రెండు చోట్లా ఒక్కరే పశువులకు వైద్యం అందించాల్సి ఉంది.
- పొల్ల పశు వైద్యులు భామిని, బత్తిలిలో రెండేళ్లుగా ఇన్‌ఛార్జి బాధ్యతలను నెట్టుకొస్తున్నారు. దీంతో దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు.

పండగ పేరుతో రూ.లక్షలు స్వాహాకు కుట్ర

కౌన్సిల్‌లో ఆమోదించలేదనే నిందలు • విలేకర్ల సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల, కౌన్సిలర్లు

ప్రజాశక్తి–సాలూరు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

శ్యామలాంబ పండగ పేరుతో బ్లీచింగ్ పౌడర్, చీపుర్లు, ఇతర సామగ్రి కొనుగోలు కోసం ప్రతిపాదించిన రూ.18 లక్షల్లో కొంత సొమ్ము కాజేయాలనే ఉద్దేశంతో మంత్రి సంధ్యారాణి అజెండా రూపొందించి, అధికారులపై ఒత్తిడి చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ చెప్పారు. పండగ అభివృద్ధి పనులను మున్సిపల్ పాలకవర్గం అడ్డుకుందని మంత్రి సంధ్యారాణి ఆరోపించిన నేపథ్యంలో శుక్రవారం చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, వైసిపి ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్‌మోహన్ రావు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి, మాట్లాడారు. పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ వానపల్లి శంకరరావు, ఇతరుల పేరిట నామినేటెడ్ పద్ధతిలో పనులు అప్పగించడానికి మంత్రి సంధ్యారాణి ఒత్తిడి చేశారని, తాము అడ్డుకున్నామనే పాలకవర్గంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఏ అభివృద్ధి పనులైనా టెండర్ పిలిచి చేపట్టాల్సి ఉందన్నారు. మంత్రి సంధ్యారాణి చెప్పినట్లు టెండర్లు పిలవకుండా రూ.18 లక్షల పనులు ఆమోదిస్తే ప్రజాధనం పక్కదారి పడుతుందనే అడ్డుకున్నామని స్పష్టంచేశారు. పట్టణంలో మహిళల ఆత్మగౌరవం పేరుతో మంత్రి సంధ్యారాణి సామాజిక మరుగుదొడ్ల మరమ్మతులు చేపడతామని 8 నెలల కిందట గొప్పలు చెప్పారని, ఇంతవరకు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్‌ని అడిగి రూ.20 లక్షలు తీసుకొస్తామని, 15 రోజుల్లో మరుగుదొడ్లు బాగు చేయిస్తానని మంత్రి బహిరంగ ప్రకటన చేశారని, అయినా ఎందుకు చేయలేకపోయారని నిలదీశారు. పండగ దగ్గర పడుతుండటంతో మీరు చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తమపై అబాండాలు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ అత్యవసర సమావేశ అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించామని చెప్పారు. శ్యామలాంబ పండగని తానే చేయిస్తున్నానని మంత్రి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పట్టణ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆమోదం మేరకు పండగ జరుగుతోందని చెప్పారు. గతంలో మంత్రిగా ఉన్న రాజన్నదొర... మోదకొండమ్మ, శంబర పండగలకు ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. మరి స్థానిక మంత్రి సంధ్యారాణి శ్యామలాంబ పండగకి ప్రభుత్వం నుంచి నిధులు ఎందుకు మంజూరు చేయించలేదని ప్రశ్నించారు. ఇటీవల పట్టణంలో పైలట్ వాటర్ ట్యాంకును మంత్రి సంధ్యారాణి ప్రారంభించిన కార్యక్రమానికి చైర్ పర్సన్, సంబంధిత వార్డు కౌన్సిలర్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. శిలాఫలకంలో చైర్‌పర్సన్, కౌన్సిలర్ పేర్లు లేకపోవడం ప్రోటోకాల్ ఉల్లంఘన కాదా? అని నిలదీశారు. గతంలో ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు సంధ్యారాణి ప్రోటోకాల్ పాటించలేదని మక్కువ దళిత ఎంపిడిఒని సస్పెండ్ చేయించలేదా? అని ప్రశ్నించారు. అదే రూల్ ఇప్పుడు మున్సిపల్ కమిషనర్‌కి వర్తిస్తుంది కదా? అని వ్యాఖ్యానించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో శ్యామలాంబ పండగ ఎందుకు నిర్వహించలేదో వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. రెండేళ్లపాటు కరోనా వైరస్ విజృంభించడం, జమిందార్ కుటుంబానికి చెందిన వ్యక్తి, జన్ని వారి ఇంటికి చెందిన మహిళ మరణించడం వంటి కారణాల రీత్యా పండగ వాయిదా వేసినట్లు చెప్పారు. పండగ సందర్భంగా అభివృద్ధి పనుల కోసం రూ.2 కోట్లు తీసుకొచ్చానని మంత్రి సంధ్యారాణి డప్పు కొట్టడం ఆపాలని, ఆ రెండు కోట్లు గ్రాంటు కాదన్న విషయం ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 40 మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్, బిఆర్ఎస్ నిధులు మంజూరు చేసిందని, అదే క్రమంలో ఈ మున్సిపాలిటీకి రెండు కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు సింగారపు ఈశ్వరరావు, బి.హైమసత్యవతి, హరి బాలాజీ పాల్గొన్నారు.

ప్రశ్నిస్తూ.. చర్చిస్తూ..

సాఫీగా సాగిన పాలకొండ నగర పంచాయతీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

ప్రజాశక్తి–పాలకొండ

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ ఆకుల మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హాజరయ్యారు. కౌన్సిల్ సభ్యులు సమావేశంలో పలు సమస్యలను లేవనెత్తారు. వాటిపై సాఫీగా చర్చించి, సమావేశం కొనసాగించారు. నగర పంచాయతీలో కౌన్సిలర్లకు తెలియకుండా, ఎటువంటి తీర్మానమూ లేకుండా ఒక వ్యక్తికి ఉద్యోగం వేయడం పట్ల సభ్యులు అభ్యంతరం తెలిపారు. కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, తుమ్మగొంట శంకర్, కోడం విజయకుమార్, తదితరులు ఈ విషయాన్ని లేవనెత్తారు. గతేడాది పదో నెలలో చైర్‌పర్సన్ రాధాకుమారి హయాంలోనే మినిట్స్ బుక్‌లో చేర్చామని అధికారులు సమాధానమిచ్చారు. తమకు తెలియకుండా మినిట్స్ బుక్‌లో ఎలా నమోదు చేశారని కౌన్సిలర్లు మండిపడ్డారు. తానే సిఫార్సు లెటర్ ఇచ్చానని, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం కూడా తెలిపారని ఎమ్మెల్యే వివరణ ఇచ్చారు. అయినా, తమకు ఎటువంటి సమాచారమూ లేదని నియామకాన్ని, నిలిపేయాలని సభ్యులు పట్టుబట్టారు.

వాటర్ వర్క్స్ విభాగంలో ఉన్న పేకేటి శ్రీనివాసరావును పారిశుధ్య విభాగంలోకి తెచ్చి అదనంగా రూ.6 వేలు జీతం పెంచడానికి కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. అనేకమంది వర్కర్లు పారిశుధ్య కార్మికుల పేరుతో ఉన్నప్పటికీ వేరే పనులు చేస్తున్నారని, ఇది సరికాదని కౌన్సిలర్లు సమావేశంలో ప్రశ్నించారు. దీనికి ఎమ్మెల్యే జయకృష్ణ కూడా గొంతుకలిపారు. ఎవరు ఏ పని చేయాలంటే ఆ పని వారితోనే చేయించాలని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. రూ.5 లక్షలు దాటిన పనులన్నీ సింగల్ టెండర్లకు అనుమతించవద్దని ఎమ్మెల్యే చెప్పారు.

గాయత్రి కాలనీ దగ్గర పెట్రోల్ బంకు నిర్మిస్తున్నారని, దీనివల్ల కాలనీలోకి మురుగునీరు వచ్చే అవకాశం ఉందని ఆ వార్డు కౌన్సిలర్ మన్మథరావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కల్వర్టు నిర్మించేలా చూడాలని కోరారు. నగర పంచాయతీ సమావేశానికి ఎమ్మెల్సీని ఎందుకు పిలవలేదని కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు.. కమిషనర్ రత్నం రాజును నిలదీశారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని, నిబంధనలు ఎలా ఉంటే ఆ విధంగా నడుచుకుపోవాలని కమిషనర్‌ను సూచించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డెంగీ నివారణలో అందరి భాగస్వామ్యం

ప్రజాశక్తి–విలేకర్ల బృందం



పార్వతీపురంలో ర్యాలీ చేపడుతున్న డిపిఒ, వైద్యులు, సిబ్బంది

డెంగీ నివారణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్ మోహనరావు పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీలు చేపట్టారు. డెంగీ నివారణ నినాదాలు చేస్తూ ర్యాలీలు కొనసాగించారు. డెంగీ లక్షణాలు, నివారణ చర్యలను డిపిఒ, వైద్యులు వివరించారు.

ఎపిజిఇఎ కార్యవర్గం ఎన్నిక



ఎపిజిఇఎ తాలూకా నూతన కార్యవర్గం

ప్రజాశక్తి–సీతంపేట

ఎపిజిఇఎ తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. శుక్రవారం స్థానిక సీతంపేట సమావేశ మందిరంలో కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షులుగా బబ్బురు గణేష్‌బాబు, కార్యదర్శిగా పి.రాంజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎపిజిఇఎ జిల్లా నాయకులు నూతలపాటి భరత్ భూషణ్ వ్యవహరించారు. పరిశీలకులుగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు శ్రీరామచంద్రరావు, జిల్లా అధ్యక్షులు కె.శంకర్‌రావు, జిల్లా కార్యదర్శి సింహాచలం, ఐటిడిఎ టైమ్ స్కేల్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు వైసతీష్ కుమార్ హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు

వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యంతో

రైతులకు ఇబ్బందులు

మండల సమావేశంలో జెడ్‌పిటిసి ఆగ్రహం

ప్రజాశక్తి–మక్కువ

వ్యవసాయ శాఖ సిబ్బంది ఈసారి అయినా ఇ-క్రాప్ సక్రమంగా చేపట్టాలని జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి మర్రి పారమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఇటీవల మృతిచెందిన పనసభద్ర ఎంపిటిసి సామంతుల వెంకటి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపిడిఒ డిడి స్వరూపరాణి మాట్లాడుతూ శాఖల వారి వివరాలను తెలియజేయాలని కోరారు. ముందుగా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతుండగా జెడ్‌పిటిసి శ్రీనివాసరావు జోక్యం చేసుకున్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది రైతులు తమ పంటలను అమ్ముకునే పరిస్థితి లేకుండా పోతుందని చెప్పారు. ఇ-క్రాప్ సక్రమంగా నమోదు చేయక పోవడంతో పంట అమ్ముకోలేని స్థితిలోకి వచ్చారని తెలిపారు. రైతులు ఇబ్బందులను, వ్యవసాయ సిబ్బంది తప్పిదాలను సభ దృష్టికి తెచ్చారు. గతేడాది సుమారు వెయ్యి ఎకరాల వరకు కొన్ని కారణాల వల్ల ఇ-పంట నమోదు చేయలేకపోయామని ఎఒ శ్రీనివాసరావు తెలిపారు. ఈసారి తప్పులు జరగకుండా చూస్తామని ఆయన తెలిపారు.

విద్యుత్తు శాఖలో దిగువస్థాయి సిబ్బంది అవినీతి వల్ల పైస్థాయిలో ఉద్యోగులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని జెడ్‌పిటిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇద్దరు ఎఇ స్థాయి ఉద్యోగులు ఎసిబికి చిక్కడంతో, ఇక్కడికి రావాలంటే ఉద్యోగులు భయపడుతున్నారని తెలిపారు. నియోజకవర్గం నుంచి మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా మక్కువ- సాలూరు ప్రధాన రహదారి టెండర్లు వెనక్కి వెళ్లిపోవడం విచారకరమన్నారు. ఇరిగేషన్ పనులు సకాలంలో చేపట్టక పోవడం వల్ల జైకా నిధులు కూడా వెనక్కి వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఆర్అండ్‌బి అధికారులు రెండు సమావేశాలకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఎంపిడిఒకు సూచించారు. ఇళ్ల మంజూరు దరఖాస్తులకు టిడిపి కార్యకర్తలు రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారని హౌసింగ్ ఎఇ సింహాచలాన్ని జెడ్‌పిటిసి నిలదీశారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి–గుమ్మలక్ష్మీపురం

రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని వ్యాధులు ప్రబలకుండా ఎసిఎం ద్రావణం పిచికారీ చేస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తగూడ, జోల్లగూడ గ్రామాల్లో చేపడుతున్న స్రేయింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ శ్రీను, ఆరోగ్య సహాయకులు ఎస్.వి.ప్రకాష్, ఎఎన్ఎంలు పి.జ్యోతిలక్ష్మి, ఆశాకార్యకర్త విజయం, ప్రమీల పాల్గొన్నారు.

కాగితాడలో వైద్య శిబిరం

ప్రజాశక్తి–వీరఘట్టం

మండలంలోని కంబర సచివాలయ పరిధిలోని కాగితాడ గిరిజన గ్రామంలో శుక్రవారం వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, జ్వరపీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి–మక్కువ

మక్కువలో కిశోర బాలికలకు వివిధ అంశాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌమార దశలో బాలికలకు రక్తహీనత, బాలల హక్కులు – రక్షణ, పోక్సో చట్టం గురించి వివరించినట్లు సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.